ప్రజాశక్తి
గురువారం 11 మే 2023 8 పేజీలు
గుంటూరు పల్నాడు





చురుగ్గా లే అవుట్‌ల నిర్మాణం

- రాజధాని గ్రామాల్లో 50 వేల మందికి ఇళ్ల స్థలాలు
- ఆర్‌-5, ఎస్‌-3 జోన్లలో భూముల ఎంపిక
- 17న పట్టాలు పంపిణీకి అధికారుల కసరత్తు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సిఆర్‌డిఎ పరిధిలోని ఆర్‌-5 జోన్‌తో పాటు గృహనిర్మాణాలకు కేటాయించిన ఎస్‌-3జోన్‌లో కూడా భూముల్లో పేదలకు ఇళ స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. న్యాయపరంగా ప్రస్తుతానికి చిక్కులులేనందున ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు గుంటూరు, ఎన్‌టిఆర్‌ జిల్లాల కలెక్టర్లపై వత్తిడి పెంచారు. ఇప్పటికే రాష్ట్ర హైకోర్టు ఇళ్ల స్థలాల పంపిణీని తాము నిలుపుదల చేయలేమని రైతులు దాఖలు చేసిన పిటీషన్‌ను కొట్టివేసింది. దీంతో అధికారులు తమప్రక్రియను వేగిరపర్చారు. ఈ నేపథ్యంలో అమరావతి మాస్టర్‌ ప్లాన్‌లో ఆర్‌-5 జోన్‌ టెక్నాలజీ సిటీకింద ఐటి పరిశ్రమల స్థాపనకు ఉపయోగించాల్సిన భూములను ప్రభుత్వం పేదలకు ఇవ్వడం సబబుకాదని రైతు నాయకులు ప్రకటించారు.

మంగళగిరి నియోజకవర్గంలో గెలవడం కోసం మంగళగిరి మండలంలోని భూములను తీసుకుంటున్నారని పేదలపై అంత ప్రేమ ఉంటే రాజధానిలో ఎస్‌-3 జోన్‌లోనే ఇళ్లస్థలాలకు కేటాయించిన భూములను ఎందుకు తీసుకోవడంలేదని రైతు ప్రతినిధులు ప్రశ్నించారు. దీంతో ప్రభుత్వం రైతు ప్రతినిధుల ప్రకటనను ఆసరాగా చేసుకుని తుళ్లూరు మండలంలో భూములను కూడా తీసుకునేందుకు గుంటూరు, ఎన్‌టిఆర్‌ జిల్లాల కలెక్టర్లకు అనుమతి ఇచ్చింది. గుంటూరు, ఎన్‌టిఆర్‌ జిల్లాలకు చెందిన పేదలకు ఇళ్ల స్థలాల కోసం మరో 268 ఎకరాలను మాస్టర్‌ ప్లాన్‌లోని ఎస్‌-3 జోన్‌లో పరిధిలోని బోరుపాలెం, పిచ్చుకల పాలెం, అనంతరం, నెక్కలు గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం ఎన్‌టిఆర్‌, గుంటూరు జిల్లా కలెక్టర్లు విజ్ఞప్తి మేరకు ఈ భూమిని కేటాయించారు. ఎన్‌టిఆర్‌ జిల్లాకు చెందిన 6,055 మంది లబ్ధిదారులకు 168 ఎకరాలు, గుంటూరు జిల్లాకు చెందిన 3417 మంది లబ్ధిదారులకు 100 ఎకరాల భూమిని కేటాయించారు.

మొత్తంగా ఎన్‌టిఆర్‌ జిల్లాలో మొత్తం 26,637 మందికి, గుంటూరు జిల్లాలో 23,235 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదటి దశలో

▶ 2లో

కృష్ణాయపాలెంలోని లే అవుట్







అర్ధరాత్రి అతిదారుణం

- రాయితో మోది ఇద్దర్ని హతమార్చిన దుండగుడు
- నిందితుణ్ణి అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు
- మృతుల్లో తెలంగాణ రాష్ట్రం వరంగల్‌ నివాసి

ప్రజాశక్తి - నరసరావుపేట

రహదారి పక్కన నిద్రిస్తున్న ఇద్దర్ని వారి తల, ముఖంపై బండరాయితో కొట్టి హతమార్చిన దారుణ ఘటన పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కలకలం సృష్టించింది. స్థానిక స్టేషన్‌ రోడ్డులో ఓ దుకాణం వద్ద ఒక మృతదేహం పడి ఉండడం, అదే మార్గంలో గాంధీ పార్క్‌ వద్ద మరో మృతదేహం పడి ఉండడాన్ని స్థానికులు బుధవారం తెల్లవారుజామున గమనించారు. వారి సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు మృతదేహాలను పల్నాడు రోడ్డులోని ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించి దర్యాప్తు చేపట్టారు. ఒకర్ని బండ రాయితో తలపై మోది హత్య చేయగా మరొకర్ని మొహంపై కొట్టి చంపినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. గతంలోనూ ఇదేవిధంగా జరిగిన హత్య కేసు ఆధారంగా ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి హత్య జరిగిన ప్రాంతంలో ఉన్న సిసి కెమెరాల పుటేజీని పరిశీలించారు. దాని ఆధారంగా పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన అంకమ్మరావును ఒన్‌టౌన్‌ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన సంపత్‌రెడ్డి (40) కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం నరసరావుపేటకు వచ్చాడు. స్థానిక స్టేషన్‌ రోడ్‌లోని గాంధీ పార్క్‌ వద్ద నిద్రిస్తుండగా మద్యం మత్తు మత్తులో అటుగా వచ్చిన అంకమ్మరావు విచక్షణ రహితంగా బండ రాయిని సంపత్‌రెడ్డి తలపై వేసి దారుణంగా హతమార్చాడు.

▶ 2లో

జగనన్నకు చెబుదాం టోల్‌ ఫ్రీ నంబరు 1902

ఫిర్యాదులు, పరిష్కారం విధానాలపై వివరాలు వెల్లడించిన గుంటూరు, పల్నాడు కలెక్టర్లు 4,5 లో

పెన్షనర్లకు ఇకెవైసి గడువు పెంచాలి

జిల్లా ఖజానా అధికారికి ఆలిండియా స్టేట్‌ పెన్షనర్స్‌ ఫెడరేషన్‌ వినతి 8 లో

20వ తేదీ వరకూ పత్తి కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి-గుంటూరు

సిసిఐకి విక్రయించే అన్ని ఎఫ్‌ఎక్యూ గ్రేడ్‌ పత్తిని మద్దతు ధర (ఎంఎస్‌పి)కు కొనుగోలు చేస్తామని కాటన్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా గుంటూరు బ్రాంచ్‌ మేనేజర్‌ జి.సాయిఆదిత్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పత్తి ధరలు ఎంఎస్‌పి స్థాయి కంటే ఎక్కువగా ఉన్నాయని, రైతులు ఎంఎస్‌పి కంటే తక్కువకు విక్రయించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రస్తుత పత్తి సీజన్‌ 2022-23 కోసం ఎంఎస్‌పి కార్యకలాపాల కింద పత్తి సేకరణ విండో ఈ నెల 20వ తేదీ వరకూ తెరిచే ఉంటుందని, రైతులు వినియోగించుకోవాని కోరారు. దేశంలో పత్తి పండించే రాష్ట్రాల్లో సిసిఐ 400 కంటే ఎక్కువ పత్తి కేంద్రాలు ప్రారంభించిందని, వాటి వివరాలు, ఎంఎస్‌పి వివరాలు, సిసిఐ నెట్‌వర్క్‌ తదితర వివరాలు cotcorp.org.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు.

అసైన్డ్‌ భూముల సాగుదార్లకు పట్టాలు

- జాతీయ రహదారికి భూములిచ్చిన వారికి త్వరలోనే పరిహారం
- పలు ప్రాంతాల్లో భూములను పరిశీలించిన పల్నాడు జెసి

ప్రజాశక్తి - మాచర్ల

మెగా టూరిజం కోసం విజయపురిసౌత్‌లో 250 ఎకరాలను గతంలో కేటాయించగా ఆ భూములను పల్నాడు జిల్లా కలెక్టర్‌ ఎ.శ్యాంప్రసాద్‌ బుధవారం పరిశీలించారు. విజయపురిసౌత్‌లో రిసార్ట్‌ నిమిత్తం కేటాయించిన 20 ఎకరాలను, ఎపిఐసిసికి కొత్తపల్లి, తాళ్లపల్లిలో పరిశ్రమల నిమిత్తం కేటాయించిన భూములను పరిశీలించారు. మాచర్ల టౌన్‌లో మురుగునీరు శుద్ధి చేసే ప్లాంట్‌కు 5 ఎకరాల భూమి కేటాయింపు అంశంపై తహశీల్దార్‌ రమేష్‌కుమార్‌, కమిషనర్‌ ఇవి రమణబాబులతో చర్చించారు. ఈ ప్రాజెక్టుకు రూ.16 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మాచర్ల ప్రాంతంలో జాతీయ రహదారికి భూములిచ్చిన వారికి త్వరలో పరిహారం వస్తుందని చెప్పారు. అసైన్డ్‌ భూములను సాగు చేస్తున్న రైతుల అర్హతను పరిశీలించి అర్హతున్న వారికి త్వరలో పట్టాలు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 1,700 ఎకరాల అసైన్డ్‌భూమిని సాగు చేస్తున్న వారి జాబితాను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. మాచర్ల ప్రాంతంలో కూడ 239 మంది రైతులకు 404 ఎకరాల అసైన్డ్‌ భూమిని అందజేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఏకోనామ్‌పేటలో అంగన్‌వాడి కేంద్రంలో పాలు, గుడ్లు పంపిణి సరిగా లేదని సిడిపిఒకు షోకాజ్‌ నోటీసు జారీ చేశారు. మాచర్ల పట్టణంలో బియ్యం పంపిణి వాహనం వద్ద కార్డుదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ అద్దెయ్య, ఎంపిడిఒ కోటేశ్వరరావు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



తహశీల్దార్‌ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతన్న జెసి

పాలీసెట్‌కు 84.59 శాతం హాజరు

ప్రజాశక్తి-గుంటూరు

పాలిటెక్నిక్‌ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి బుధవారం నిర్వహించిన పాలీసెట్‌ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. గుంటూరు నగరం, పరిసర ప్రాంతాల్లో 14 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. మొత్తం 5412 మందికి గాను 4578 (84.59 శాతం) మంది హాజరయ్యారు. బాలురు 3394 మందికిగాను 2889 మంది, బాలికలు 2018 మందికి గాను 1689 మంది పరీక్ష రాశారు. సాంకేతిక విద్య రాష్ట్ర సంచాలకులు సిహెచ్‌ నాగరాణి నగరంలోని జెకెసి, జిపిడబ్ల్యు కాలేజి పరీక్షా కేంద్రాలను సందర్శించారు. సాంకేతిక విద్య బోర్డు సెక్రెటరీ కె.రమణ రావు, జాయింట్‌ డైరెక్టర్‌ పద్మారావు, జిల్లా స్పెషల్‌ అబ్జర్వర్‌, ఈతముక్కల పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపల్‌ ఏసుప్రసాదరావు నగరంలోని పలు కేంద్రాలను పరిశీలించారు. జిల్లా కో-ఆర్డినేటర్‌ టి.శేఖర్‌, అసిస్టెంట్‌ కో-ఆర్డినేటర్‌ మోసెస్‌ అరవింద్‌ పరీక్షలను పర్యవేక్షించారు.

చురుగ్గా లే అవుట్‌ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌-5 జోన్‌లో 40 వేల మందికి అవకాశం ఇచ్చారు.రెండో దశలో ఎస్‌-3 జోన్‌లో మరో 9472 మందికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈగ్రామాల్లో కూడా లే అవుట్‌లకు రంగం సిద్ధం చేస్తున్నారు.ఇప్పటికే ఆర్‌-5 జోన్ పరిధిలో ఏడు గ్రామాల్లో మొత్తం 21 లే అవుట్‌లు సిద్ధం చేస్తున్నారు. మే 17 నాటికి ఇళ్ల పట్టాలకు లే అవుట్‌ల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించారు.

ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 569.46 ఎకరాల్లో లేఅవుట్లలో 20,684మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కురగల్లు, నిడమర్రు, మందడం తదితర గ్రామాల్లో 11 లే అవుట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన పేదలకు 550 ఎకరాల్లో 20 వేల మందికి పట్టాలు ఇచ్చేందుకు 10 లేఅవుట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పెదకాకాని, తుళ్లురు మండలాలతో పాటు మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో దాదాపు 20వేల మందికి ఇంటి స్థలాల పట్టాల ను సిద్ధం చేస్తున్నారు. మందడం, కృష్ణాయపాలెం, నవులూరు, నిడమర్రు, ఐనవోలు గ్రామాల్లో 10 లేఅవుట్‌లలో. పెదకాకాని, తుళ్లురు, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో లబ్ధిదారులకు అవకాశం కల్పించనున్నారు.

అర్ధరాత్రి అతిదారుణం

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం మృతుని జేబులో ఉన్న నగదును తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సంపత్‌రెడ్డి మృతి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. హత్యకు గురైన మరో వ్యక్తిని యాచకునిగా గుర్తించి వివరాల కోసం ప్రయత్నిస్తున్నారు. మృతునికి 55-60 ఏళ్లుంటాయని చెబుతున్నారు. గతేడాది ఇదే తరహాలో కూరగాయల మార్కెట్ వద్ద రోడ్డుపై నిద్రిస్తున్న యాచకురాలిని అంకమ్మరావే హత్య చేసినట్లు సమాచారం. మొత్తం 11 హత్యకేసులు, మరో చోరీకేసులో అంకమ్మరావు నిందితుడుగా ఉన్నట్లు సమాచారం. కొన్ని కేసుల్లో జైలులో ఉన్న అంకమ్మరావు బెయిల్‌పై వచ్చినట్లు తెలిసింది.



పిహెచ్‌డి పట్టాను అందుకుంటున్న పి. కృష్ణచైతన్య

విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని, ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పీ.కృష్ణచైతన్యకు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ఇంప్లాంటబుల్ అండ్ వేరబుల్ ఆంటెనాస్ ఫర్ బయో-మెడికల్ అప్లికేషన్స్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారన్నారు. కృష్ణచైతన్యకు విజ్ఞాన్ యూనివర్సిటీ ఈసీఈ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమ్.పచియానన్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పీ.క్రిష్ణచైతన్యను విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

తెనాలిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణంలో విద్యుత్ లైన్లు మరమ్మతులు కారణంగా గురువారం తెనాలి మారిస్ పేట ప్రాంతంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎపిసిపిడిసియల్ ఆపరేషన్ సబ్ డివిజన్ టౌన్ డిఇఇ బి. అశోక్ కుమార్ బుధవారం ప్రకటన విడుదల చేసారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖవారికి సహరించాలని కోరారు.

కొలకలూరులో అడుగు పడని అభివృద్ధి


అధ్వాన్నంగా ఉన్న ఎస్సీ కాలనీ రోడ్డు

- ఎస్సీ కాలనీలో శంకుస్థాపనలకే పరిమితం
- ఎంపిటిసి రాజీనామాను సైతం పట్టించుకోని వైనం

ప్రజాశక్తి-తెనాలి

మండలంలోని కొలకలూరు గ్రామంలో అభివృద్ధి పనుల జాడే లేదు. ప్రభుత్వం ఆర్భాటంగా చేసిన శంకుస్థాపనలు శిలాఫలకాలతోనే పరిమితమయ్యాయి. స్థానిక ప్రజాప్రతినిధులు రాజీనామాకు అల్టిమేటం ఇచ్చినా ఏమాత్రం పరిస్థితిలో మార్పులేదు. అభవృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి వేసిన శిలాఫలకాలు..శిలఫలకాలుగానే మిగిలిపోయాయి.


నిర్మాణానికి నోచుకోని రోడ్డు

తెనాలి నియోజకవర్గంలో అతి పెద్ద గ్రామం కొలకలూరు. దాదాపు 20వేల జనాభా, 13వేల మంది ఓటర్లు ఉన్న గ్రామంలో నలుగురు ఎంపిటిసిలున్నారు. వారిలో ఒకరు మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా కూడా పని చేస్తున్నారు. పైగా ఈ నలుగురూ అధికార పార్టీకి చెందినవారే ఉన్నారు. గ్రామంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి వేసిన శిలాఫలకాలు శిలాఫలకాలుగానే ఉన్నాయి. మూడేళ్ళకుపైగా ఇదే పరిస్థి నెలకొని ఉంది. ఈ గ్రామంతో పాటు మరి కొన్ని గ్రామాల్లో శంకుస్థాపనలు చేసిన రోడ్లు లక్షణంగా పూర్తయ్యాయి. కాని కొలకలూరు ఎస్సీ కాలనీలో మాత్రం ఎలాంటి మార్పు లేదు.


మూడేళ్ళక్రితం శంఖుస్థాపన శిలాఫలకం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గెలుపొందిన తొలినాళ్ళలోనే గ్రామంలో తొలి అభివృద్ధి కార్యక్రమానికి నాంది పలికారు. తాళ్లూరి, అత్యాల వారి నివాసాల ముందుగా సమాధుల తోట రోడ్డు నుంచి మెయిన్‌రోడ్డుకు అనుసంధానంగా సిసి రోడ్డు నిర్మాణానికి రూ.40లక్షలు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 2020 జనవరి 11న శంఖుస్థాపన చేశారు. వాస్తవానికి కనీసం ప్రజలు నడిచే పిరిస్థితి లేని రోడ్డు ఇది. వర్షం పడితే మోకాళ్ల లోతులో నీళ్లు నిలుస్థాయి. దీంతో ప్రాధాన్యతా క్రమంలో శంఖుస్థాపన చేసి మూడేళ్ళు దాటిపోయినా నిర్మాణం ప్రారంభమే కాలేదు. విధిలేని పరిస్థితిలో నడక కోసం స్థానికులు డస్ట్, చిన్ని ముక్క పోయించుకున్నారు. అలాగే కొలకలూరు గ్రామ ప్రధాన కూడలి నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే అనుమర్లపూడి డొంక రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షల అంచనాతో 2021 అక్టోబర్4న శంఖుస్థాపన చేశారు. ఈ రోడ్డులో శేకూరు, సుద్దపల్లి క్వారీల నుంచి గ్రావెల్ తరలించే వాహనాలు, కొలకలూరు జగనన్న కాలనీకి మెటీరియల్ తరలించే టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు ప్రయాణిస్తుంటాయి. కాలనీకి వెళ్ళాలంటే ప్రధానమైన రోడ్డు ఇదే. భారీ వాహనాల రాకపోకలతో రోడ్డులో పెద్దపెద్ద గోతులు పడి ప్రమాదకరంగా మారింది. రోడ్డు ప్రమాధభరితంగా ఉన్న పరిస్థితుల్లో నిర్మాణానికి ఎమ్మెల్యే శంఖుస్తాపన చేశారు. ఇప్పటికీ రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. ఇవి రెండు మచ్చుకు మాత్రమే. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పనులు గ్రామంలో చేసిన శంఖస్థాపనలు శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. ఎమ్మెల్యే గ్రామాభివృద్ధిపై తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి.

ఎంపిటిసి రాజీనామా అల్టిమేటంపై కూడా స్పందన కరువే

నియోజకవర్గ అబివృద్ధి పనుల్లో కొలకలూరు గ్రామం మాత్రమే వివక్షకు గురౌతున్న వైనంపై మండల పరిషత్ సమావేశాల్లో గ్రామ రెండో సెగ్మెంట్ ఎంపిటిసి కాలిశెట్టి ఫణికుమార్ పలుమార్లు నిలదీశారు. కొలకలూరుతో పాటు ఇతర గ్రామల్లో శంఖుస్థాపనలు చేసిన అభివృద్ధి పనులు పూర్తి చేసినా, కొలకలూరు శంకుస్థాపనకే పరిమితం కావటంపై నిరసన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు అదిగో ఇదిగో అంటూ సర్దుబాటు చేస్తూ కాలం వెళ్ళదీశారు. ఈపిరిస్థితిని అదిగమించి ఫిబ్రవరి 5న జరిగిన మండల పరిషత్ సమావేశంలో ఫణికుమార్ రాజీనామా అస్త్రాన్ని సంధించారు. గ్రామంలో అభివృద్ధి పనులు మార్చి నెలాఖరులోగా ప్రారంభం కాకుంటే ఎంపిటిసి సభ్యునిగా రాజీనామా చేస్తానంటూ అల్టిమేటం ఇచ్చారు. ముందుగానే జెడ్పీ సిఈవోకు రాసిన రాజీనామా పత్రాన్ని కూడా సమావేశంలో అందించారు. అయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు.

పొన్నూరు ఆర్టీసీ డిపో అభివృద్ధికి నిధులు మంజూరు


ఆర్‌టిసి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

పొన్నూరు ఆర్టీసీ డిపో ప్రాంగణాన్ని స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య బుధవారం పరిశీలించారు. కొన్ని ఏళ్ళ నుంచి డిపో ప్రాంగణంలో వర్షాలు పడినప్పుడల్లా తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ప్రజలు తెలుపగా త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఆర్టీసీ మేనేజర్ టి. శ్రీనివాసరావును సమస్యను అడిగి తెలుసుకున్నారు. డిపోకు అభివృద్ధిలో భాగంగా రూ.29.50 లక్షల నిధులు మంజూరు చేశారని త్వరలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ టి. శ్రీనివాసరావు డిపో సిబ్బంది వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన బిషప్‌లు


చైర్మన్ అహ్మద్‌ఖాన్‌కి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న బిషప్‌లు

ప్రజాశక్తి -మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌ని బుధవారం ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో అధ్యక్షులు బిషప్ బాలరాజు, ప్రధాన కార్యదర్శి బిషప్ డేవిడ్ రాజు ,కోశాధికారి బిషప్ విక్టర్ పాల్, బిషప్ నవీన్ కుమార్, బిషప్ మోసెస్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఆక్సిజన్ ప్లాంట్ బహుకరించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రైస్తవులకు సంబంధించి వినతి పత్రాన్ని అందించారు. చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ సేవల్ని కొనియాడుతూ క్రైస్తవులకు ఉండే సమస్యల పట్ల చొరవ తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్

రైతులను ఆదుకోవడంలో అలసత్వం తగదు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అకాల వర్షాలతో జిల్లాలో రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు,వైసిపి ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లుగా కూర్చువడం చూస్తుంటే విడ్డురంగా ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రులు రైతులతో అనుచితంగా మాట్లాడుతూ వారి అక్కసును వెళ్లగక్కుతున్నారని అన్నారు. రైతుల సమస్యలను ప్రజల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి, అధికార యంత్రాంగం ధృష్టికి తీసుకెళ్లడానికి టిడిపి ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 నిరసన దీక్ష చేపట్టనున్నామని తెలిపారు. రాజధాని అమరావతికి భూములిచ్చిన బొత్స మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతి ప్రాంతం మునిగిపోయేదని, శ్మశానమని, ఎడారి అని మాట్లాడిన మంత్రులు, స్పీకర్, వైసిపి నేతలు... నేడు అమరావతి ప్రాంతంలో పేదలకు సెంటు భూమి ఇస్తున్నామని ప్రగల్భాలు పలకడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. కార్యక్రమంలో కె. శివరామయ్య, డి. శ్రీనివాసరావు, నాయుడు ఓంకార్, బొబ్బిలి రామారావు, వేములకొండ శ్రీనివాస్, తలతోటి సురేంద్ర, జి. సోమశేఖర్, ధూళిపాళ్ళ ఏసుబాబు, కసుకుర్తి హనుమంతరావు, జి.రాంబాబు పాల్గొన్నారు.

తుమ్మపూడి వద్ద రాస్తారోకో

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండలంలోని తుమ్మపూడి గ్రామ సమీపంలో తెనాలి-విజయవాడ రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు దాదాపు మూడు గంటల పాటు రహదారిని దిగ్బంధం చేశారు. అత్యంత రద్దీగా ఉండే రహదారి కావడంతో కిలోమీటర్ల దూరంలో వాహనాలు నిలిచి పోయాయి. చిలువూరు గ్రామానికి చెందిన గళ్ళే ప్రదీప్ అనే విద్యార్థి రేవేంద్రపాడు జిల్లా పరిషత్ హై స్కూల్ లో పదో తరగతి చదువుతున్నాడు. గత సంవత్సరం జూన్ 8వ తేదీన చిలువూరు రైల్వేస్టేషన్‌కు దక్షిణం వైపున పట్టాలపై అతని మృతదేహం ఛిద్రమై పడి ఉంది. రైల్వే పోలీసులు పోస్టుమార్టం చేయించి విచారణ చేపట్టారు. మృతుని కుటుంబసభ్యులు ఇది ప్రమాదవశాత్తు జరిగిన సంఘటన కాదని తోటి స్నేహితులు హత్య చేశారని ఆరోపించడంతో పాటు తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. చిలువూరు గ్రామం దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధిలోనిది కావడంతో ఈ కేసును దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో దుగ్గిరాల పోలీసులు సక్రమంగా విచారణ నిర్వహించడం లేదని ఆరోపిస్తూ బాధిత కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. మంగళగిరి డిఎస్పి జె.రాంబాబు ఇతర పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. కుటుంబ సభ్యులను గురువారం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వద్దకు తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. దీంతో ఆందోళన విరమించారు. కేసు విచారణలో ఉందని దుగ్గిరాల పోలీసులు తెలిపారు.


ఆందోళనకారులతో మాట్లాడుతున్న మంగళగిరి డిఎస్పి జె.రాంబాబు


రహదారిపై ఆందోళన చేస్తున్న మతుడి కుటుంబ సభ్యులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

నగదు, బంగారం అపహరణ

ప్రజాశక్తి-తెనాలి: తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. 75గ్రాముల బంగారం, కొన్ని వెండి వస్తువులు, కొంత నగదును అపహరించారు. స్థానిక బాలాజీరావుపేట మహేంద్రదేవ్ కాలనీలో నివాసం ఉండే కొలసాని వెంకటభూపతి నాయుడు ఈ నెల 2న హైదరాబాద్‌లోని తన కుమారుడి గృహప్రవేశం నిమిత్తం కుటుంబంతో కలిసి వెళ్ళాడు. ఇంట్లో ఎవరూ లేరన్న విషయాన్ని గుర్తించిన దుండగులు రెండస్థుల భవనంలో కింది పోర్షన్ తలుపుగు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు బీరువాల తాళాలు పగులగొట్టి 75గ్రాముల బంగారపు హరం, కొన్ని వెండి వస్తువులు, రూ.30వేల నగదును అపహరించినట్లు బాధితులు చెబుతున్నారు. మంగళవారం ఇంటికి వచ్చిన పని మనిషి తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గమనించి, హైదరాబాద్‌లోని ఓనర్లుకు సమాచారం ఇచ్చింది. వెంటనే వారు బయలుదేరి బుధవారం ఉదయం ఇంటికి చేరుకుని త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిఐ యు.శ్రీనివాసులు నేతృత్వంలో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్‌టీమ్ ద్వారా ఆధారాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వైసిపిలో చేరిన యర్రం, పక్కాల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర రెడ్డి, ఆయన కుమార్డు నితిన్ రెడ్డి, బిజెపి నాయకుడు పక్కాల సూరిబాబు బుధవారం సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. సత్తెనపల్లికి చెందిన వీరు ముగ్గురిని ఇటీవల టిడిపిలోకి తీసుకురావాలని ఆ పార్టీలోకి ఆహ్వానించినా వీరు వైసిపిలో చేరారు.రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వీరిని సిఎం వద్దకు తీసుకువెళ్లి వైసిపిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపి లావు కృష్ణదేవరాయులు పాల్గొన్నారు.

పశ్చిమ డిఎస్‌పిగా ఉమామహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ విభాగం డిఎస్‌పిగా బి.ఉమామహేశ్వర్ రెడ్డి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయన జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్‌తో పాటు పలువురు అధికారులను కలిశారు. 1995 సంవత్సరంలో ఎస్సైగా సర్వీస్ ప్రారంభించి రాయలసీమ జిల్లాల్లో పని చేశారు. సిఐగా కడప, అనంతపురంలో పనిచేశారు. డిఎస్పీగా ప్రమోషన్ పొంది శ్రీ సత్యసాయి జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం బదిలీపై గుంటూరు వచ్చారు. ఆయనను పలువురు సిఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిశారు.


ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్ ను కలిసిన డిఎస్‌పిగా బి.ఉమామహేశ్వర్ రెడ్డి

విద్వేషాగ్నుల్ని చల్లార్చాలి

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక సంస్కృతి ప్రబోధిస్తున్న పరస్పర సహకార భావ నకు భిన్నంగా మణిపూర్ రాష్ట్రంలో చిరకాలంగా జాతి వైష మ్యాలు నివురు గప్పిన నిప్పులా కొనసాగుతున్నాయని, చిలికి చిలికి గాలి వాన అయినట్లు కొద్ది రోజుల క్రితం అవి తీవ్ర హింసాత్మకంగా మారాయని అవగాహన సంస్థ ఆందోళన వెలిబుచ్చింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి కె.శివరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. మూడు దశాబ్దాల్లో మొదటిసారి గిరిజనులు, గిరిజనేతర నడుమ చెలరేగిన ప్రత్యక్ష ఘర్షణలో అధికారిక గణాంకాల ప్రకారమే 50కి పైగా నిండు ప్రాణాలు బలయ్యా యని, మతం రంగును కూడా పులుముకున్న ఆ గొడవల్లో వందల మంది క్షతగాత్రుల య్యారని పేర్కొన్నారు. సుమారు 23 వేల మంది సాధారణ పౌరులు స్వస్థలాలను విడిచి సైనిక కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారని, ఘర్షణలను ఆదిలోనే అడ్డుకట్ట వేయడంలో యంత్రాంగం వైఫల్యం మూలంగా ఈ దుస్థితి వచ్చిందని అభిప్రాయపడ్డారు. మణిపూర్‌లో రాజకీయంగా, సామాజికంగా శక్తిసంపన్నులైన మెయ్ తెయ్ లను ఎస్టీల్లో చేర్చేందుకు వీలుగా కేంద్రానికి సిఫార్సు చేయాలని మణిపూర్ హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడమే ఘర్ష ణలకు నాంది పలికిందని, ఆ తీర్పుపై కుకీ, నాగా గిరి జనుల అభ్యంతరాలే ఘర్ష ణలకి ప్రధాన కారణమని పేర్కొన్నారు. తెగల మధ్య ప్రజ్వరిల్లుతున్న విద్వేషాగ్నులను చల్లార్చేందుకు పౌర సమాజం భాగస్వామ్యంతో కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు.

నవ్వే అత్యుత్తమ ఔషధం

ప్రజాశక్తి - గుంటూరు

నువ్వు ఆరోగ్యానికి మంచిదని, ప్రపంచంలోని అత్యుత్తమ ఔషధాల్లో ఒకటని, రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుం దని, మానసిక స్థితిని పెంచుతుందనిప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్ కుమార్ అన్నారు. అవ గాహన సంస్థ హాస్యవల్లరి బంద సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రపంచ నవ్వుల దినోత్సవంలో డాక్టర్ వి.వి.రామ్ కుమార్ మాట్లాడుతూ నవ్వు, దాని యొక్క అనేక వైద్య ప్రయోజనాల గురించి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం మే నెలలో ఒకరోజు ప్రపంచ నవ్వుల దినోత్స వాన్ని జరుపుకుంటారన్నారు. అనేక అధ్యయనాల ప్రకారం ఎక్కువగా నవ్వే వ్యక్తి ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించ గలడు అన్నారు. ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని మే 10, 1998న భారతదేశంలోని ముంబైలో జరుపుకున్నారని, ప్రపంచవ్యాప్తంగా నవ్వుల యోగ ఉద్యమ వ్యవస్థాపకుడు డాక్టర్ మదన్ కటారియా ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. విశ్రాంత టెలికాం అధికారి పి.మొగిలి మాట్లాడుతూ ప్రపంచంలోని చాలా పెద్ద నగరాల్లో ప్రపంచ నవ్వుల దినోత్సవం జరుపుకుంటున్నారని, కామెడీ, నవ్వుల పట్ల ప్రజల ప్రేమను వ్యక్తపరిచే మార్గంగా నవ్వుల దినోత్సవం నిలుస్తుందని అన్నారు. అందరూ హాస్య ప్రధాన సినిమాలు, పుస్తకాలు, హాస్య సన్నివేశాలు చూస్తూ ఆనందంగా ఉంటే అన్నీ రోగాల్నించి బయటపడొచ్చన్నారు. కార్యక్రమంలో లాఫింగ్ థెరపీ, లాఫింగ్ యోగ పద్ధ తుల ద్వారా, జోక్స్, కామెడీ స్కిట్స్ ద్వారా హాస్య వల్లరి బృంద సభ్యులు వెంకటేశ్వరరావు, చంద్రశే ఖర్, నాగేశ్వరరావు, జగన్‌మోహన్‌రావు నవ్వించారు.



మిర్చి నిల్వలు

		బ్యాగులు
మిర్చి దిగుమతి	:	81,023
మిర్చి ఎగుమతి	:	88,049
మిర్చి నిల్వ	:	52,178

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 22,000
నెం.5	13,000 - 20,500
273	15,000 - 22,000
341	9,200 - 23,000
4884	14,000 - 18,000
సూపర్ 10	12,500 - 14,500
నాన్ ఎసి	
తేజ	9,500 - 23,500
బడిగి	11,500 - 22,000
దేవనూరు డీలక్స్	10,000 - 22,000
తాలుకాయలు	5,500 - 13,500

డ్రైవింగ్ శిక్షణ కోసం ఆర్‌టిసి స్కూల్

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన (కారు, జీప్) వారికి గుంటూరు 2 డిపో నందు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్ ప్రారంభించినట్లు మేనేజర్ ఎస్‌కె అబ్దుల్ సలామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే 10 బ్యాచ్‌లు శిక్షణ పొందాయని, 11వ బ్యాచ్ అతి త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఒక్కో బ్యాక్‌కు 16 మందికే అవకాశం ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు పేర్లను త్వరగా నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణలో భాగంగా ప్రతిరోజు ఒక గంట వాహనం యొక్క వివిధ భాగాలు, వాటి పనితీరు గురించి, వివిధ రకాల రోడ్ల గురించి, రోడ్ల పైన ఉండే పెయింటింగ్ మార్కుల గురించి, రోడ్ల ప్రక్కన ఉండే సైన్ బోర్డులను, గురించి రోడ్ల ప్రక్కన ఉండే సిగ్నల్ బోర్డుల గురించి వివరిస్తామని తెలిపారు. ప్రతిరోజు ప్రాక్టికల్‌గా ప్రతి ఒక్కరిచేత 15 కిలోమీటర్లు బస్సును నడిపిస్తామని, వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాలు జరిగే తీరును వివరిస్తామని పేర్కొన్నారు. ఘాట్ రోడ్ నందు ఎటువంటి భయం లేకుండా నడుపుటకు కొండవీడు ఘాట్ రోడ్డు నందు, కోటప్పకొండ ఘాట్ రోడ్డు నందు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం ధ్రువపత్రాలు ఇస్తామని, వాటి ఆధారంగా ఆర్‌టిఎ నిర్వహించే టెస్టులో పాల్గొని లైసెన్స్ పొందవచ్చని తెలిపారు. వివరాల కోసం 8897371003, 7382894585 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.



బొల్లాపల్లి, దుర్గి మండలాల్లో పులుల సంచారం

జిల్లా అటవీ అధికారి రామచంద్రయ్య

ప్రజాశక్తి-నరసరావుపేట



పల్నాడులో పలు ప్రాంతాలలో పులుల సంచారంపై జిల్లా అటవీశాఖ అధికారి రామచం ద్రయ్య వివరణ ఇచ్చారు. బొల్లాపల్లి, దుర్గి మండలాల్లో కొన్ని రోజుల నుంచి పులులు సంచరి స్తున్న ట్లుగా ఏర్పాటు చేసిన నిఘా నేత్రాల ద్వారా వెల్లడైందని పేర్కొన్నారు. సమాచారం వచ్చిన వెంటనే తాము అప్ర మత్తమయ్యామని అటవీ సమీప గ్రామాల ప్రజ లను కూడా అప్రమత్తం చేశామన్నారు. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉండే ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ఆయా గ్రామాల ప్రజలకు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చెబు తున్నామన్నారు. దుర్గి మండలం గజాపురంలో ఇటీవల ఒక ఆవుని పులి చంపిందని పులులు పట్టుకోవడానికి సీసీ కెమె రాలు ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న పులి పిల్లల వీడియోలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఇటీవల నాగార్జునసాగర్, విజయపురి సౌత్ వద్ద నిఘా నేత్రాల ద్వారా 2 పులుల ఉన్నట్లు గుర్తించామన్నారు.సోషల్ మీడి యాలో తప్పుడు ప్రచారం చేస్తే కేసులు పెడతామన్నారు.

బిజెపి ఎంపిపై 'పోక్సో' కేసు నమోదు చేయండి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-నరసరావుపేట

మహిళ రెజ్లర్ల పై లైంగిక వేధిం పులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజు భూషణ్ శరణ్ సింగ్ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కారుచోళ నవిత డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నవిత మాట్లా డుతూ మహిళ క్రీడాకారులపై ఎంపీ లైంగిక వేధింపులు సిగ్గు చేటన్నారు. రెజ్లింగ్‌లో ఒలింపిక్ మెడల్స్ సంపాదించిన దేశ ప్రతిష్టను విదేశాలకు చాటి చెప్పి దేశానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చిన క్రీడాకారులను లైంగిక వేధింపులు, దాడులకు గురి చేస్తూ అవమానిస్తున్నారని, నిరసన తెలిపినా ఎంపిపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని విమర్శిం చారు. ప్రధాని గాని, కేంద్ర మహిళ మంత్రులు గాని లైంగిక వేధింపులకు గురైన మహిళా రెజ్లర్ల సమస్యల గురించి పట్టించుకోకపోవడం సిగ్గు చేటని దుయ్యబట్టారు. క్రీడాకారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యా దును కూడా అధికారులు ఖాతరు చేయడంలేదన్నారు. కనీసం ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేసి, బిజెపి ఎంపిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయడానికి పోలీసులు జంకుతున్నారని విమర్శించారు. దేశంలో న్యాయవ్యవస్థను బిజెపి రెండు విధాలుగా అమలు చేస్తోందని, ఒకటి సాధారణ న్యాయం, ఇంకోటి బిజెపి న్యాయమని విమర్శించారు. బిజెపి ఎంపిలు, ఎమ్మెల్యేలు ఎవరు తప్పు చేసినా ఎలాంటి కేసులు ఉండవని విమర్శిం చారు. తక్షణమే రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష పదవి నుంచి కూడా బ్రిజ్‌భూషణ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘా లను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరు ఏపీ మోడల్ స్కూల్లో 2023-24 విద్యాసంవత్సరానిక ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. విద్యార్థులు apms.ap.gov. in/apms వెబ్‌సైట్‌లో జనరల్, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సి,ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించి మే 25 తేది నాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ఐదో తరగతి స్థాయిలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో నిర్వహిస్తారని ప్రిన్సిపల్ తెలిపారు.

జగనన్నకు చెబుదాం టోల్ ఫ్రీ నంబరు 1902

విలేకరుల సమావేశంలో కలెక్టర్ ఎల్.శివశంకర్

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లాలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తామని కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 'జగనన్నకు చెబుదాం'పై కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని 1902 టోల్ ఫ్రీ నంబరుతో గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి, డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి వరకు ఈ కార్య క్రమాన్ని కొనసాగిస్తామని అన్నారు. గ్రామ స్థాయిలో పంచాయతి కార్యదర్శి, వెల్ఫేర్ సెక్రటరి, మండల స్థాయిలో తహ శీల్దార్, మండల అభివృద్ధి అధికారి, డివిజన్ స్థాయిలో ఆర్.డి.ఒ., మున్సిపల్ శాఖల అధికారులు, జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ప్రజా సమస్యలను పరిశీలించి, పరిష్కారం చేస్తారని వెల్లడించారు. 1902 టోల్ ఫ్రీ నంబరు కు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా తెలియజేసి సత్వర పరిష్కారం పొందవచ్చని, ఎప్పటికప్పుడు వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అవసర మైన సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక యాప్ ను ఏర్పాటు చేశామన్నారు. వచ్చిన సమస్యలన్నింటినీ ఒక్కో ఆన్ లైన్ లాగిన్‌లో సమస్యకు పరిష్కార మార్గం చూపాలని, గ్రామస్థాయిలో తొలు త ప్రజలు పంపే ప్రతీ సమస్య రేషన్ కార్డు, పింఛన్, ఆరోగ్యశ్రీ, ఇంటి స్థలం, ఇల్లు, విద్యా, వైద్యం తదితర సమస్యలు పరిష్కారం కోసం సచివాలయానికి వెళతాయని, అక్కడ పరిష్కారం కాకపోతే మండల స్థాయికి, అక్కడ కూడా పరిష్కారం లభించకపోతే డివిజన్ స్థాయికి వెళతాయని చెప్పారు. అక్కడి నుంచి జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి వెళ్ళి పరిష్కారం లభించిన అనంతరం ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక వెళుతుందని వివరించారు. వీటిపై ప్రతి జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక అధికారులను ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు. ప్రతీ సమస్యకు ప్రభుత్వం ఐ.డి. నంబరును కేటాయించడం జరుగుతుందని, సమస్య పూర్తయ్యే వరకు దరఖాస్తు దారుడి ఐ.డి. ఆన్‌లైన్‌లో కనిపిస్తూ ఉంటుందని అన్నారు. 1902 టోల్ ఫ్రీ నంబరును ఉపయోగించుకొని సమస్యలకు సత్వర పరిష్కారం పొందాలని ప్రజలకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున కలెక్టర్



22న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-క్రోసూరు

ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు ఈ నెల 22 వ తేదీన నర్సరావుపేట కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి పిలుపు నిచ్చారు. ఉపాధి పని ప్రదేశాల వద్దకు పర్యటనల్లో భాగంగా బుధవారం వ్యవసాయ కార్మిక సంఘ నాయకత్వ బృందం క్రోసూరు మండలం 88 తాళ్లూరు, ఎర్రపాలెం, గుడిపాడు, గరికపాడులలో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు గత బడ్జెట్‌లో 98 వేల కోట్ల రూపాయలు కేటాయించిన ప్రభుత్వం, ఈ బడ్జెట్‌లో రూ. 60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని, వాటిలో ఇప్పటికే ఉపాధి పనులు చేసిన వేతనాలకు రూ.25 కోట్లు బకాయిలు ఉన్నాయని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో మూడు లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు, ఉపాధి కూలీలను పొమ్మనలేక పొగ పెట్టినట్టు 2023 జనవరి నుండి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం తీసుకొని వచ్చి నాలుగు గంటలకు ఓసారి ఫోటో యాప్ ద్వారా మానిటరింగ్ చేయాలని కొత్త పద్ధతి తీసుకురావడంతో అనేక చోట్ల సర్వర్ పని చేయక, చేసిన ఉపాధి పనికి కూలీలకు బిల్లులు రావడం లేదని అన్నారు. ఇప్పటివరకు సమ్మర్ అలవెన్స్‌తో పాటు గడ్డపార, తట్ట, మంచినీటికి ఉపాధి కూలీలకు అదనంగా వేతనాల్లో కలిసి అలవెన్సులు వచ్చేవని, నేడు బిజెపి ప్రభుత్వం అన్నింటిని రద్దు చేసిందని విమర్శించారు. ఉపాధి పనులు చేసిన కూలీలకు పే స్లిప్పులు ఇవ్వడం లేదని, వేసవికాలంలో మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా పంపిణీ చేయడం లేదని, వీటి మూలంగా వడదెబ్బకు ఉపాధి కూలీలు చనిపోతున్నారని, వారి కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు, సమస్యల పరిష్కారం కోసం, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం రద్దు చేయాలని, తదితర డిమాండ్ల సాధన కోసం 22వ తేదీన నిర్వహించనున్న ధర్నాకు ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఉపాధి పనుల పరిశీలనలో వ్యవసాయ కార్మిక సంఘం క్రోసూరు మండల అధ్యక్ష కార్యదర్శులు వై.వెంకటేశ్వర్లు, జి. చెన్నప్ప, కౌలు రైతు సంఘం నాయకులు టి.హనుమంతరావు పాల్గొన్నారు..

నరసరావుపేట డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మహేష్

ప్రజాశక్తి-నరసరావుపేట

నరసరావుపేట డీఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన డిఎస్పీ కెవి.మహేష్ బుధవారం పల్నాడు ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. డిఎస్పీ కె.వి మహేష్ 2018 బ్యాచ్ కి చెందిన మొట్టమొదటి సారిగా కర్నూలు పోలీస్ సబ్ డివిజన్ డిఎస్పీగా విధులు నిర్వహించారు. అనంతరం సాధారణ బది లీల్లో భాగంగా పల్నాడు జిల్లా నరసరావుపేటకు బదిలీ అయ్యారు. నూతన బాధ్యతలు చేపట్టిన డిఎస్పీకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. పల్నాడు జిల్లా శాంతి భద్రతల స్థాపనకు తన వంతు సమర్థవంతంగా పని చేస్తానని, సిబ్బందిని ఎప్పటి కప్పుడు అప్రమత్తం చేస్తూ పారదర్శకంగా విధులు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు.


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిఎస్పీ

ఆసరా మూడో విడత సొమ్ము కొందరికేనా!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

జగనన్న ఆసరా పథకం మూడో విడత కింద డ్వాక్రా మహి ళలకు రుణమాఫీ సొమ్ము ఇచ్చేందుకు సీఎం జగన్ బటన్ నొక్కి సుమారు 36 రోజులైంది. అయితే, కొంతమంది మహిళల ఖాతాలకు మాత్రం ఆ సొమ్ము ఇంతవరకూ జమ కాలేదు. ఆసరా మూడో విడతకు సంబంధించి గత ఏడాది అక్టోబర్‌లో బటన్ నొక్కాల్సి ఉంది. ఆరు నెలలు ఆల స్యంగా ఏలూరు జిల్లా దెందులూరులో ఈ ఏడాది మార్చి 25వ తేదీన జగన్ బటన్ నొక్కారు. ఈ అమౌంట్ ఏప్రిల్ 5వ తేదీలోగా ఆయా ఖాతాల్లో జమ వుతాయని అధికారులు మహిళలకు తెలిపారు. కొంత మంది ఖాతాల్లో మాత్రమే ఆ సొమ్ము జమైంది. మిగిలిన వారు ఇంకా ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. 2019 ఏప్రిల్ 11 నాటికి డ్వాక్రా మహిళలకు ఎంత బాకీ ఉందో ఆ మొత్తాన్ని నాలుగు విడతలుగా ఈ పథకం ద్వారా రుణమాఫీ చేస్తామని నాడు ఎన్నికల ముందు జగన్ హామీ ఇచ్చారు. మొద టి విడత జమ పోను, మిగిలిన డబ్బులకు వడ్డీని డ్వాక్రా మహిళలే కట్టాల్సి ఉంది. ముఖ్యమంత్రి నాలుగు విడ తలుగా జమ చేసే అమౌంట్‌కి, మొదటి విడత ,రెండో విడత జమ అయ్యే నాటికి మధ్యలో ఉన్న కాలపరిమితికి సంబంధించిన వడ్డీని మహిళలే చెల్లించుకోవాల్సి ఉం టుంది. మూడేళ్ల క్రితం పట్టణ పరిధిలో మొత్తం డ్వా క్రా గ్రూపులు 1820 గ్రూపులు మాత్రమే పూర్తి స్థాయిలో అమ ల్లో ఉండగా,, 1317 గ్రూపులకు మాత్రమే 'ఆసరా'కు అర్హత పొందినట్లు అధికారులు చెబుతున్నారు. మూడో విడత సొమ్ము ఇందులో సగం గ్రూపులకు రాలేదని, కొం చెం ఆలస్యమైనా జమవుతాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూడో విడత 'ఆసరా' సొమ్ము జమ గాని ఖాతాల్లోకి వేయాలని, తగిన చర్యలు తీసుకోవా లని డ్వాక్రా మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.



చిలకలూరిపేటలోని మెప్మా విభాగం



పిల్లలు కాదు పిడుగులు

ప్రజాశక్తి-తాడేపల్లి: గత వారం రోజుల నుంచి మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో కుంచనపల్లి అరవింద హైస్కూల్లో జరుగుతున్న మ్యాజిక్ శిక్షణా శిబిరంలో బాలబాలికలు రాణిస్తున్నారు. పిల్లలు కాదు పిడుగులని నిరూపిస్తున్నారు. గత వారం రోజుల నుంచి ప్రపంచ ప్రఖ్యాత గాంచిన ఇంద్రజాలికులు క్రాంతికార్ ఆధ్వర్యంలో నేర్చుకున్న వివిధ రకాల మ్యాజిక్‌లను బుధవారం బాలలు చేసి చూపించారు. కేవలం పిల్లలు నేర్చుకున్న వాటిని ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. లోటుపాట్లు ఉంటే శిక్షకులు వాటిని సరిదిద్ది వాళ్లల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎంపిడిఓ ఆదినారాయణ మాట్లాడుతూ మ్యాజిక్ నేర్చుకునే సమయంలో పిల్లల మనసు, దృష్టి మ్యాజిక్‌పైనే ఉండాలన్నారు. ప్రదర్శన ఇచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు, మెళకువలు ఎలా తీసుకోవాలో వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మేజీషియన్ గాజుల పిచ్చయ్య, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ప్రముఖ గాయని శారదాచలపతికి ఎన్‌టిఆర్ సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్: హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకష్ణ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాలు 250వ రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో మంగళవారం ఎన్టీఆర్ నటించిన మేజర్ చంద్రకాంత్ చిత్రాన్ని బుధవారం ఉచితంగా ప్రదర్శించారు.ప్రముఖ గాయని, సంకీర్తనాపరురాలు ఉప్పలూరి శారదా చలపతికి నాయకులు కె.రజిని, శివనాగలక్ష్మి, మహాలక్ష్మి పి.భాస్కరరావు, బి.యుగంధర్, పి శేషాచలపతి ఎం రమణయ్య, ఒగ్గు వెంకటకృష్ణారావు, లీలా కృష్ణ ఎన్టీర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. థియేటర్ కమిటీ సభ్యులు పి.పోతురాజు, డాక్టర్ ఎ. మల్లేశ్వరరావు, డి భవాని, ఇ శ్రీనివాసరావు, ఎస్ సాంబశివరావు, ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు, డి.భాస్కర్, ఎం వెంకట్, ఎన్ శ్రీనివాస్, నరసయ్య, యు ధర్మారావు, బి వెంకట్ పాల్గొన్నారు.



అలేఖ్యకు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి- మంగళగిరి: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థి పులి అలేఖ్యకు ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు అభినందనలు తెలిపి సత్కరించారు. రూ.15వేల ప్రోత్సాహక నగదు బహుమతులను బుధవారం అందజేశారు. పట్నంలోని బాప్టిస్ట్ పేటకు చెందిన పులి అలేఖ్య ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో 440 మార్కులకు గానూ 429 మార్కులు సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన అలేఖ్య ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే ఆర్కే అలేఖ్యకు రూ.10వేల ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేయగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతురావు అలేఖ్యకు దశ్శాలువా కప్పి సత్కరించి రూ.5వేల నగదు బహుమతిని అందజేశారు. ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసిన విద్యార్థిని అలేఖ్యతో పాటు ఆమె కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం. మల్లేశ్వరరావు, ఎస్ సునీత, ఎ. రాజేష్, ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

జగనన్నకు సమస్యలు చెప్పొచ్చు

జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజలు తెలిపిన సమస్యలకు మరింత మెరుగైన పరిష్కారం అందించాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్నకు చెబుదాం కు ఎవరైనా తమ సమస్యలను తెలియజేయవచ్చునని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లో సంయుక్త కలెక్టర్ జి రాజకుమారితో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ 1902 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ప్రజలు ఇంటి నుంచే వారికి ఉన్న సమస్యలను 24/7 హెల్ప్ లైన్‌కు తెలియజేయవచ్చున్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యకు యువర్ సర్వీస్ రిక్వేస్ట్ (వైఎస్ఆర్) నెంబరు , లింక్ తో కూడిన సంక్షిప్త సందేశాన్ని ఫోన్‌కు పంపుతారని అన్నారు. ఇప్పటివరకు జరుగుతున్న స్పందన కార్యక్రమంలో తీసుకుంటున్న అర్జీలు జగనన్నకు చెబుదాం కార్యక్రమంకు అనుసందానం చేసి మరింత మెరుగ్గా అందుబాటులో ఉంటాయన్నారు. ఇప్పటికే ప్రతి గ్రామ, వార్డు సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతున్న స్పందన కార్యక్రమంలోను, ప్రతి సోమవారం మండల, డివిజన్, జిల్లా స్థాయిలో జరుగుతున్న స్పందనలో ప్రజలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జె.సి రాజకుమారి

అందించిన వినతులు, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 1902 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా వచ్చిన వినతులు అన్నింటిని సక్రమంగా పరిష్కరించేలా నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. సమస్యలను మరింత మెరుగ్గా పరిష్కరించటానికి ప్రాసెస్ రీఇంజనీరింగ్ ద్వారా సమస్యలు ఎక్కువుగా వస్తున్న శాఖలకు సంబంధించి కారణాలను పూర్తి స్థాయిలో విశ్లేషించి, పరిష్కారాలను సులభతరం చేయటం జరుగుతుందన్నారు. ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్స్ (పీఎంయు)ను రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారంను నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందన్నారు, పీఎంయులో నియమించిన అధికారులందరూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని సంబంధిత శాఖ అధికారికి ఫార్వర్డ్ చేసి వాటిని సక్రమంగా పరిష్కరించేలా జిల్లా, డివిజన్, మండల స్థాయిలో నిరంతరం పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. పరిష్కరించిన వినతి పై ప్రజల నుంచి పరిష్కరించిన విధానం పై ఫీడ్ బ్యాక్ తీసుకొని కారణాలను విశ్లేషించటం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ నుంచి గ్రామ, వార్డు సచివాలయంలోని ఉద్యోగి వరకు ప్రజలు అందించిన పిర్యాదులను ముఖ్యమంత్రి రిఫర్ చేసినట్లుగా భావించి అత్యధికంగా ప్రాధాన్యత ఇచ్చి మరింత మెరుగ్గా పరిష్కారించే ప్రయత్నం జరుగుతుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభం సందర్భంగా కూడ ముఖ్యమంత్రి చేసిన మార్గనిర్దేశం ప్రకారం జిల్లా యంత్రాంగంను సిద్దం చేయటం జరిగిందన్నారు. జిల్లాలో వస్తున్న పిర్యాదులను విశ్లేషించగా ఎక్కువుగా మున్సిపల్, రెవెన్యూ, పంచాయితీ రాజ్, పోలీస్, విద్యుత్ శాఖ తదితర శాఖల నుంచి వస్తున్నట్లు తెలిసిందన్నారు. ఎక్కువుగా పిర్యాదులు వస్తున్న శాఖల ముఖ్య అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులను పీఎంయూలలో నియమించటం జరిగిందన్నారు. వీరు ప్రజలు ఇచ్చిన సమస్యలకు సక్రమంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవటంతో పాటు సరియైన పరిష్కారం ఇవ్వలేకపోతున్న సమస్యలకు కారణాలను విశ్లేషించి దానికి సంబంధించి తీసుకోవాల్సిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేలా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల పరిష్కారంను ప్రతి సోమవారం, బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు.

ఉపాధి కూలీలకు మూడు వారాలుగా అందని కూలి



కూలీలతో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

- పని ప్రదేశాల్లో ఎండలకు తాగునీటి ఇబ్బందులు
- గతంలో ఇచ్చిన సదుపాయాలు కల్పించాలని వ్యకాస డిమాండ్
- సమస్యలపై మే 22న కలెక్టర్‌రేట్ వద్ద ధర్నాకు పిలుపు

ప్రజాశక్తి -ఫిరంగిపురం : మండలంలో ఉపాధి కూలీలకు రావాల్సిన బకాయి వేతనాలు రూ.14,57.900 లక్షలనూ, పొనుగుపాడు గ్రామంలో రావాల్సిన బకాయి వేతనాలు రూ.32,091 వేలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం పొనుపాడు గ్రామంలో ఉపాధి పని జరుగుతున్న పని ప్రదేశాన్ని సందర్శించి ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు వారి యొక్క సమస్యలను వ్యవసాయ కార్మిక సంఘం బృందం దృష్టికి తీసుకువచ్చారు. కంప్యూటర్‌లో పేరు రాలేదని పని ఇవ్వటం లేదని, మూడు వారాలుగా డబ్బులు రాలేదని తెలిపారు. ఎండ తీవ్రంగా ఉంటుందని మంచినీళ్లకు ఇబ్బంది కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించిందని, ఉపాధి హామీ పనికి కొత్త కొత్త నిబంధనలు తీసుకొచ్చారని రెండు పూటల పని పద్ధతి, మాన్యువల్ మాస్టర్ బదులు ఆన్లైన్ మాస్టర్ వల్ల నెట్టు అందక పోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కనీస వేతనం రూ.272లగా నిర్ణయించినప్పటికీ ఇది ఎక్కడా అమలు జరగడం లేదని తెలియజేశారు. అలాగే పని చేసిన చోట కనీస సౌకర్యాలు కూడా ఇవ్వటం లేదని టెంట్ , మంచినీళ్లు, మెడికల్ కిట్టులు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చే సదుపాయాలు కూడా రద్దు చేసిందని వెంటనే వాటిని పునరుద్ధరించి, పలుగుకు రూ.50లు,తట్టకురూ.20లు, మంచినీళ్లకు రూ.10లు ఇవ్వాలని తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలో మేట్లకు స్మార్ట్ ఫోన్ అందజేసి రూ.5లు పారితోషికం ఇవ్వాలని ఆయన కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు, అలాగే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మే 22న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలు ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండలం రైతు సంఘం నాయకులు జి. వెంకటేశ్వరరావు , ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వందకు వంద మార్కులు సాధించిన వంశీ హైస్కూల్

ప్రజాశక్తి-తాడేపల్లి



భవ్యశ్రీ, చరణి

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉండవల్లి సెంటర్ వంశీ హైస్కూల్ వందకు వంద మార్కులు సాధించి రికార్డు సృష్టించింది . ప్రతి ఇద్దరిలో ఒకరికి 500కు పైగా మార్కులు వచ్చాయని ప్రిన్సిపల్ డి.ప్రసాద్ తెలిపారు. తమ విజయ రహస్యం అర్థమయ్యేలా చెప్పడం, పిల్లలను ఆలోచించేలా చేయగలగడమేనని చెప్పారు. సంవత్సరాల తరబడి తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకానికి మారుపేరుగా ఫలితాలు వచ్చాయని చెప్పారు. ఇంతటి అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీప్రతిభ స్కూల్ విజయకేతనం

ప్రజాశక్తి-తాడేపల్లి



వైష్ణవి, అన్నపూర్ణదేవి

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు విజయ కేతనం ఎగుర వేశారని శ్రీప్రతిభ స్కూల్ ప్రిన్సిపల్ కె.లక్ష్మీప్రసాద్ తెలిపారు. 82 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. తొమ్మిది మంది 500 మార్కులకు పైగా సాధించారన్నారు. అత్యుత్తమ విద్యా బోధన, ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు, చదువుకోవాలన్న తపనపడిన విద్యార్థులు, ప్రోత్సహించిన తల్లిదండ్రులు అందరికీ అభినందనలు తెలిపారు. సుందరయ్యనగర్‌లో శ్రీప్రతిభ విజయకేతనం విద్యార్థుల ఇళ్లల్లో సంతోషాన్ని నింపిందని తెలిపారు.

నేటి నుంచి ఆక్యుపక్చర్ చికిత్స శిబిరం


ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి సెంటర్‌లోని వంశీ టాలెంట్ స్కూల్లో గురువారం నుంచి ఆక్యుపంక్చర్ చికిత్సా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి 16వ తేదీ వరకు ఆరు రోజుల పాటు ఆక్యుప్రెషర్, మాగ్నటిక్, వైబ్రేషన్ థెరఫి సేవలు అందుటబాటులో ఉంటాయని చెప్పారు. వీటితో పాటు అధిక బరువు, రక్తపోటు, మోకాళ్ల నొప్పులు, సయాటికా, తలనొప్పి, జాయింట్ పెయిన్స్, నిద్రలేమి, కంటి, కీల్లనొప్పులు, ఆస్తమా, ఇఎన్‌టి, ఎసిడిటి, గర్భాశయ రోగాలకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 చెల్లించాలని చెప్పారు. మహిళలకు ప్రత్యేకంగా మహిళా థెరఫిస్ట్ ద్వారా చికిత్స అందించనున్నట్లు చెప్పారు.

డాక్టర్ షేక్‌కు మంత్రి అభినందనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుగా, వైసిపి డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వై షేక్ అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఇటీవల కాలంలో డాక్టర్స్ సెల్ విభాగం ఆధ్వర్యంలో 70 మందికిపైగా వైద్యులను డాక్టర్ వై షేక్ పార్టీలో చేర్పించారు. అంతేకాకుండా జిల్లా



డాక్టర్ షేక్‌కు అభినందనలు తెలుపుతున్న మంత్రి రజిని

వ్యాప్తంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం మంత్రి విడదల రజిని చిలకలూరిపేటలోని కార్యాలయంలో డాక్టర్ వైషేక్‌ను శాలువా, పుష్పగుచ్చం అందజేసి సత్కరించి, అభినందించారు. అధిక సంఖ్యలో వైద్యులను పార్టీలోకి తీసుకు రావడంతో మరింత చొరవ చూపించాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు సేవలందించాలని ఆకాక్షించారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి-నరసరావుపేట

ఈ నెల 30వ తేదీ నాటికి నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్. శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మండల అధి కారులు, ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ కమిషనర్లు తదితర సిబ్బందితో నాడు-నేడుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమం కింద చేపట్టిన పనులకు సంబంధించి సుమారు రూ.28 కోట్లు రివాల్వింగ్ నిధులు అందుబాటులో ఉన్నాయని, సదరు నిధులను సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. అవసరమైన చోట పనులను నిధులు సర్దుబాటు ద్వారా పూర్తి చేయాలన్నారు. సంబంధిత మండల అభివృద్ధి అధికారులు, ఎంఈఒ లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, మున్సిపల్ కమిషనర్లు వంద శాతం పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చేవారం సమీక్ష సమావేశం నాటికి పనులు పురోగతిలో ఉండాలన్నారు. కాంపౌండ్ వాల్, అదనపు క్లాస్ రూమ్ నిర్మాణం వంటివి కాకుండా మిగతా పనులు 100 శాతం పూర్తి కావాలన్నారు. మేజర్ మైనర్ పనులు, ఎలక్ట్రిఫికేషన్, టాయిలెట్ల నిర్మాణం వేగవంతం కావాలని సూచించారు. ఇంతవరకు పనులు ప్రారంభించిన వాటిని త్వరితగతిన ప్రారంభించి పనులలో పురోగతి సాధించాలని సూచించారు. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఇసుక సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో కో లోకేటెడ్ కేంద్రాల్లో పనులు ప్రారంభించాలని, ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, గ్రామోదయం కార్యక్రమాల ద్వారా 'ఉయ్ లవ్ రీడింగ్' కార్యక్రమాన్ని పిల్లలకు వివరించి మంచి మంచి పుస్తకాలు చదివేలా అవగాహన కల్పించాలని సూచించారు. పనుల పురోగతిని రోజువారి సమీక్షించుకుని పురోగతి సాధిం చేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనులు పూర్తిచేయాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధి కారి శామ్యూల్, డిఆర్‌డిఎ పిడి బాలు నాయక్, ఐసిడిఎస్ పిడి అరుణ, ఎస్‌ఎస్‌ఎ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ విద్యా సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, పాల్గొన్నారు.


సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్,అధికారులు

కమాండ్ కంట్రోల్ టీమ్‌తో ప్రత్యేక సమావేశం

ఇకపై వారంలో రెండు రోజులు

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల నిర్వహణ, పర్యవేక్షణ మరింత సమర్ధవంతంగా నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్, అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ టీమ్ బృందంతో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి చేస్తున్న తీరు, ప్రభుత్వానికి పంపుతున్న నివే దికలపై బుధవారం ఆయన ఆరా తీశారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రగతిని పెంచే విధంగా అధి కారులు, సిబ్బందితో రోజు వారి పనుల నివేది కలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో అందుబాటులో ఉండాలని, దీని వల్ల మిగతా జిల్లాలతో పోటీ పడి పనుల్లో నాణ్యత పెరుగు తుందని కలెక్టర్ చెప్పారు.

ఇక నుంచి వారంలో రెండు రోజులు కమాండ్ కంట్రోల్ టీమ్ తో ప్రత్యే కంగా సమా వేశం నిర్వహించి, జిల్లా ప్రగతి పరిస్థితులను తెలుసుకొని అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, ఎక్కడ అధికారులు పని చేయక పోయినా వారి ద్వారా ఆ వివ రాలను కమాండ్ కంట్రోల్ ఉద్యో గులు సంబంధిత అధి కారులకు పంపి వెంటనే ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయించాలని ఆదేశించారు. ఇక నుంచీ ప్రతీ మంగళ వారం, బుధవారం పూర్తి స్థాయిలో ప్రభుత్వ పనుల కోసం కొంత సమ యం కేటాయించి నివేదికలను తయారు చేసి పంపాలని సూచించారు.కమాం డ్ కంట్రోల్ టీమ్ మొత్తం 7 నియోజక వర్గాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులపై పట్టు సాధించి, జిల్లాను రాష్ట్ర పట్టికలో తొలి 3 స్థానాలలో ఉండేలా చూడాలని ఆదేశిం చారు. ప్రజ లకు మెరుగైన సేవ లను అం దించే జగన న్నకు చెబుదాం, స్పందన, ఎస్. డి.జి. మహిళల ఆరోగ్యం, చిన్నారుల ఆరోగ్యం, రక్త హీనత, విద్య, వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్య పరి రక్షణ, పారిశుధ్య పనులు, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సూచించారు.



ఆహ్లాదకర వాతావరణం, సుందరీకరణకు ప్రాధాన్యం

ప్రజాశక్తి-నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో ఆహ్లాదకరమైన వాతా వరణం నెలకొల్పేందుకు సుందరీకరణకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ శివ శంకర్ పేర్కొన్నారు. నగరోదయం పేరుతో పట్టణాలను అందంగా తీర్చి దిద్దేందుకు గాను ఎస్,ఆర్.శంకరన్ హాల్ నందు జిల్లా వ్యాప్తం గా అన్నినియోజక వర్గాల పరిధిలో అర్బన్ మున్సిపాలటీల లో ప్రహరీ గోడలకు అందమైన రంగులు వేసే కార్యక్రమంపై బుధవారం ఆయా మున్సిపల్ కమీషనర్లు, సచివాలయ ఉద్యోగులతో బ్యూటికేషన్ ఆఫ్ అర్బన్ సిటీస్ పై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నరసరావుపేట పట్టణం, వినుకొండ, సత్తెనపల్లి తదితర మున్సిపాలిటి పరిధిలోని పట్టణాలలో నగర సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రధాన రహదారులు, అంతర్గత ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల వెంట ఉన్న ప్రహరీ గోడలకు అందమైన రంగులను వేసి అత్యంత రమ ణీయంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఆదే శించారు. ఇందు కోసం ప్రణాళిక బద్ధంగా రహదారుల వెంట ఉన్న ప్రభుత్వ గోడలు, ప్రైవేటు గోడలు గుర్తించడం, వాటి పొడవు, వెడల్పు, వైశాల్యం వివరాలను వెంటనే సేకరించి నివేదికను తయారు చేయాలని ఆదేశించారు. అదే తరహాలో అను భవం, నైపుణ్యం కలిగిన కళాకారుల ద్వారా ప్రహరీ గోడలకు అందమైన ఆకృతులతో బొమ్మలు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం వారిని ఆహ్వానించి 500 అడుగులు వరకు పెయింటింగ్ వేసేందుకు సహకారం తీసుకోవాలని ఆదేశించారు. అందంగా, రంగులతో ఆకర్షణీయంగా తీర్చి దిద్దిన వారికి ప్రథమ బహుమతి గా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు పారితోషికం ఇవ్వనున్నట్లు చెప్పారు. చిన్నారులు, పెద్దలు, కళాకారులు వంటి 3 కేటగిరీల్లో గోడలకు అందమైన రంగులు వేసిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు. వివరాలకు 7680905745 నెంబరు నమోదు చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.త





ఆ పార్టీలను సాగనంపితేనే అభివృద్ధి : కాంగ్రెస్

ప్రజాశక్తి-మాచర్ల

ఏపిలో అభివృద్ధి చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టరు యరమల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీలు రాకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటూ ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వారి అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని విమర్శించారు. వీరి వల్ల రాష్ట్రం సర్వ నాశనమైందని మండిపడ్డారు. ఓటర్లు ఆలోచన చేసి అభివృద్ధి చేసే సత్తా ఉన్న కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, ప్రస్తుత పాలక పార్టీలకు బుద్ధిచెప్పాలని కోరారు.. సమావేశంలో షేక్ బాబు, వెంకటేశ్వర్లు, ఆదాము, నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పలు గ్రామాల్లో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల గృహాల వద్ద జరిగే వివిధ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సుడిగాలి పర్యటన చేశారు. మండలంలోని మన్నెసుల్తాన్ పాలెం, ఎమ్మాజిగూడెం గ్రామాల్లో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అదే గ్రామాల్లో వివాహానికి హాజరయ్యారు. ఎమ్మాజిగూడెంలో గేదెలు కాయడానికి వెళ్లి పక్కనే ఉన్న కృష్ణా నదిలో కొట్టుకెళ్లి చనిపోయిన టిడిపి కార్యకర్త కుటుంబం ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారికి భరోసా కల్పించారు. అక్కడ నుండి కందిపాడులో పల్లె కొండలు చిమట శీను కుమారుడు కుమార్తెల వివాహాలకు ఆయన హాజరయ్యారు.



వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-బెల్లంకొండ

బెల్లంకొండ అడ్డరోడ్డులో వేంచేసిన కోళ్లూరు శ్రీ ఆంజనేయ స్వామి 63వ వార్షికోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి 16 వరకు జరగనున్నాయి. ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వానపత్రిక పోస్టర్‌ను బెల్లంకొండ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి ,తహశీల్దార్ నిర్మల,ఎంపిడిఒ వెంకట్‌రెడ్డి పలు గ్రామాల పంచాయతి సర్పంచులు ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ ఉత్సవాల్లో పాల్గొని వార్షికోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు.



ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-దుగ్గిరాల

గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ ఆసుపత్రి వారు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సేవలందించడం అభినందనీయమని ఈమని ఎంపిటిసి, మండల వైస్ ప్రెసిడెంట్ పసుపులేటి సాయి చైతన్య అన్నారు. మండలంలోని ఈమనిలో గుంటూరుకు చెందిన మాట్రిక్స్ ఆసుపత్రి వారు బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందించారు. పేదలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించినందుకు హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ ఎం. శ్రీకాంత్ మాట్లాడుతూ అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించటానికి అనుభవజ్ఞులైన డాక్టర్ల బృందం వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. సతీష్ చైతన్య, డాక్టర్ ముత్యాల జ్యోత్స్న , డాక్టర్ ముత్యాల అనుపమ, మేనేజర్ సతీష్ కుమార్ , ఆసుపత్రి సిబ్బంది, జనసేన నాయకులు పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌పిగా జనార్ధనరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-తెనాలి



డిఎస్‌పి బి. జనార్ధనరావు

తెనాలి సబ్ డివిజినల్ పోలీస్ అధికారిగా బుధవారం బి.జనార్ధనరావు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల పోలీసు శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా ఆయనను తెనాలికి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఆయన విజయవాడ వెస్ట్ ఏసిపిగా పనిచేస్తూ, తెనాలి డిఎస్‌పిగా వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన కె.స్రవంతిరాయ్ ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ సిసిఎస్ డిఎస్‌పిగా బదిలీ అయ్యారు. 1995 బ్యాచ్‌కు చెందిన జనార్ధనరావు తొలుత ఏలూరులో, తదుపరి సిఐడి, ఎసిబి విభాగాల్లో పనిచేశారు. జనార్ధనరావు తొలుత వైకుంఠపురం ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ ఒన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, రూరల్ సిఐలు కె.చంద్రశేఖరరావు, ఎస్.వెంకట్రావ్, యు.శ్రీనివాసులు, శ్రీనివాసరెడ్డి, పలువురు ఎస్ఐలు స్వాగతించారు. డిఎస్‌పి మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని, ముఖ్యంగా గంజాయి విక్రయాలను అరికడతామన్నారు. నేర నియంత్రణలో ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా పోలీసులకు సహకరించాలన్నారు.



ధ్రువ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

సచివాలయ ఉద్యోగులకు క్రమబద్ధీకరణ ధ్రువపత్రాలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సామాన్యుడికి క్షేత్ర స్థాయిలో సేవలందిస్తేనే ప్రభుత్వం బలాన్ని పుంజుకుంటుందని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. తెనాలి మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన సచివాలయ ఉద్యోగుల రెగ్యులరైజ్డ్ ఉత్తర్వుల జారీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గున్నారు. సెకండ్ ఫేజ్ ప్రొబేషన్ పిరియడ్ పూర్తిచేసుకున్న సచివాలయ ఉద్యోగుల రెగ్యులరైజ్డ్ ఉత్తర్వులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం వార్డు అడ్మిన్, ఎడ్యుకేషనల్, డేటా ప్రాసెస్సింగ్ సెక్రెటరీ, శానిటేషన్, ఎన్విరాన్మెంట్, ప్లానింగ్ సెక్షన్ల రెగ్యులరైజ్డ్ సిబ్బందికి ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, మున్సిపల్ కమీషనర్ ఎం జస్వంతరావు, సహాయ కమిషనర్ ఎం గోపాలరావు, మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్ మానసిక వైద్య విభాగాన్ని సందర్శించిన డిఎల్ఎస్ఎ సెక్రెటరీ



రోగులతో మాట్లాడుతున్న డిఎల్ఎస్ఎ న్యాయమూర్తి చంద్రమౌళీశ్వరి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి బుధవారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి, మానసిక వ్యాధుల వార్డును సందర్శించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆ విభాగం వైద్యులతో ఆమె సమీక్షించారు. వ్యాధిగ్రస్తులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు. రోగులు వారికి అందుతున్న వైద్యం పట్ల సంతృప్తిని వెలిబుచ్చారు. వైద్యులు ఈ విభాగాన్ని ఎంచుకోవటం అరుదుగా కనిపిస్తారని, కావున ఈ విభాగంలో పనిచేస్తున్నందుకు అక్కడున్న వైద్యులను అభినందించారు. మహిళా వైద్యులు కూడా ఉండటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తొలుత రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రికి వచ్చే పేషంట్లకు న్యాయ పరమైన సమస్యలు ఉంటే ఆసుపత్రిలోని లీగల్ ఏయిడ్ క్లినిక్‌ను సంప్రదించి, న్యాయ సహాయం పొందాలని సూచించారు. కార్యక్రమంలో సహాచార్యులు వి.వి.కిరణ్, సహాయ ఆచార్యులు సాయి కిరణ్, మాజీ అదనపు పిపి కట్టా కాళిదాసు, వైద్యులు సాయికష్ణ, నిమిషా, శ్రీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా పరిశ్రమలకు అనుమతులు



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు అందించిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్దేశిత సమయంలో పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇండస్ట్రియల్ ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ ఎం మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. సింగల్ డెస్క్ పోర్టల్‌లోని దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 45 పరిశ్రమల ప్రోత్సాహకాలకు సంబంధించి 65 క్లెయిమ్స్‌కు రూ.7,59,94,105లు మంజూరు చేస్తూ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆమోదించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ విజయరత్నం, డిపిఓ కేశవరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూధనరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వి. గోపికష్ణ, అసిస్టెంట్ కమీషనర్ కమర్షియల్ ట్యాక్స్ ఏ.రఘునాథ బాబు, ఏ.పి.ఎస్ఎఫ్‌టీ బ్రాంచ్ మేనేజర్ కె.అజిత, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ యం.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడు శేషయ్యను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతం,అనంతవరం గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు శేషయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పారిశుధ్య కార్మికులు విజ్ఞప్తి చేశారు.పారిశుధ్య విధులు మానేసి రెండో రోజు బుధవారం కూడా అనంతవరం,నెక్కల్లులో కార్మికులు పనులను నిలిపివేసి నిరసనలు తెలిపారు. కార్మికులపై వేధింపులు ఆపాలని, కార్మికుడు శేషయ్యను వెంటనే పనిలోకి తీసుకోవాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజధాని పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి మాట్లాడుతూ,కార్మికులకు పెండింగ్ ఉన్న ఏప్రిల్ నెల జీతం చెల్లించాలన్నారు .శేషయ్యను అకారణంగా పనికిరావద్దంటూ కో-ఆర్డినేటర్ నరసింహారావు,సూపర్ వైజర్ మన్మథ రావులు చెప్పి వారం రోజులైనప్పటికీ తిరిగి పనిలోకి తీసుకోకుండా శేషయ్యపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం అన్యాయమని రవి అన్నారు. శేషయ్య తనను పనిలోకి తీసుకోమని కో-ఆర్డినేటర్, సూపర్ వైజర్ కాళ్ళపై పడినా పేద కార్మికుడన్న కనికరం చూపించకుండా అతని కడుపు మీద కొట్టడం దుర్మార్గమని అన్నారు. చీటికీమాటికీ రాజధానిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను వారం,పది రోజులు పనికి రావద్దని భయపెట్టి తమ చెప్పు చేతల్లో ఉంచుకోవాలని అనుకోవటం తగదన్నారు. వేధింపులకు పాల్పడే వారికి తగిన సమయంలో కార్మికులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తక్షణం శేషయ్యను పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అనంతరవరంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి పెన్షనర్స్ హోమ్‌లో బుధవారం పెన్షనర్స్ అసోసియేషన్ మంగళగిరి శాఖ సహకారంతో విజయవాడకు చెందిన సెంటిని హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు పి వంశీకృష్ణ మాట్లాడుతూ ఎముకుల పటుత్వం గురించి వివరించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలను అందుబాటులో ఉండే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ జనరల్ మేనేజర్ జి. వెంకటరమణ, మంగళగిరి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్: ఎంటిఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త షేక్ మౌలాలి(సిద్ధ) అనారోగ్యానికి గురైన క్రమంలో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం టిడిపి నాయకులు మౌలాలి ఇంటికి వెళ్లి, ఆయన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ మండల నాయకులు కాట్రగడ్డ మధుసూదన్ రావు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఈ. బాబు, ప్రధాన కార్యదర్శి మన్నెం సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్ నాయకులు బెజ్జం రామకృష్ణారావు, తెలుగు యువత నాయకులు షేక్ నాగూర్ వలి, కామినేని సాంబశివరావు, చావలి సురేష్ తదితరులు ఉన్నారు.



పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

హైకోర్టు సీజెను కలిసిన నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని కోర్టుల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసినందుకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాకు ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం అసోసియేషన్ నాయకులు జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాను హైకోర్టులోని చీఫ్ జస్టిస్ చాంబర్‌లో కలిసి పూలబొకే అందచేసి, శాలువాతో సన్మానించారు. జస్టిస్ మిశ్రాను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు అక్కెన వేణుగోపాల్‌రావు, ఆంధ్రప్రదేశ్ న్యాయశాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షులు రామరాజు చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచకొండ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ రావుల నవీన్ కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న నున్న వెంకటేశ్వర్లు ,అధికారులు

రైతు భరోసా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఫిరంగిపురం

మేరికపూడి, నుదురుపాడు గ్రామాల రైతు భరోసా కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రబీలో పండించిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, మొక్కజొన్న వేసిన రైతులందరూ రైతు భరోసా కేంద్రాలలో తమ పేరును రిజిస్టర్ చేసుకొని తమకు కేటాయించిన తేదీలలో మీ గ్రామాలలోని మొక్కజొన్నలు సేకరిస్తారని తెలిపారు. భూసారాన్ని పెంచేందుకు ప్రతి రైతు తమ పొలాలలో పచ్చిరొట్ట పైరు సాగు చేసి 30 రోజుల తర్వాత కలియదున్నాలని తెలిపారు.దీనివలన రైతులకు ఎరువుల భారం తగ్గటంతో పాటు నాణ్యమైన పంటల ఉత్పత్తిని పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ వ్యవసాయ అధికారి ఓ సునీల్ కుమార్, మండల వ్యవసాయ అధికారి కే. రమణ కుమార్ , వ్యవసాయ విస్తరణ అధికారులు , గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



చెక్కబల్ల బండ్లను అందజేస్తున్న టిడిపి నాయకులు

చెక్క బల్ల బండ్లు పంపిణీ

ప్రజాశక్తి -మంగళగిరి

పట్నంలోని టిడ్కో గృహ సముదాయంలో గల పేద చిరు వృత్తిదారులకు నారా లోకేష్ సహకారంతో బుధవారం రాత్రి ఏ. శ్రీనివాసరావు టిఫిన్ బండి, టి. సూర్యప్రకాష్ రావుకు ఇస్త్రీ బండ్లులను టిడిపి నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు దామర్ల రాజు, షేక్ రియాజ్, గోవాడ దుర్గారావు, వాకా మాధవరావు, బి శ్రీనివాసరావు, సింహాద్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఇకెవైసి గడువు పెంచాలి



జిల్లా ఖజానా అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

పెన్షనర్లు ఇకెవైసి పూర్తి చేయాల్సిన గడువు ఈనెల 10వ తేదీతో ముగిసిందని, అయితే ఇంకా అనేక మంది చేసుకోవాల్సి ఉన్నదని గడువు ఈనెల 30వ తేదీ వరకూ పెంచాలని ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. బుధవారం జిల్లా ఖజానా అధికారి బి.రాజగోపాల్‌కు ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందచేశారు. అనారోగ్య కారణాలతో ఇల్లు కదలలేనివారు, 75-95 ఏళ్ళ వయసులో ఉన్న వారు వారి ఆధార్ కార్డులను మొబైల్ ఫోన్ నంబర్లు అనుసంధానం కాలేదని తెలుసుకొని, ఆధార్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ ఆందోళన చెందుతున్నారని చెప్పారు. కొంతమంది ఆధార్ కేంద్రాలకు వెళ్లలేని వారు వేలిముద్రల పని చేయని వారు పెన్షన్ రాదేమోనని ఆందోళన చెందుతున్నారని అన్నారు. వృద్ధాప్యంలో పిల్లల దగ్గర లేక, ఒంటరి జీవితం గడుపుతున్న వృద్ధులను దృష్టిలో పెట్టుకొని పరిష్కారమార్గం తెలపాలని, మంచానికి పరిమితమైన వారికి ఇకెవైసి నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. జిల్లా ఖజానా అధికారి స్పందిస్తూ వీలైనంత త్వరగా ఇకెవైసి పూర్తి చేసుకోవాలని, అసోసియేషన్ నాయకులు తెలిపిన అంశాలను రాష్ట్ర అధికారుల దృష్టికి కూడా తీసుకెళతామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి పి.నాగరాజు, పెన్షనర్స్ వాయిస్ ఏపీ ఎడిటర్ టి.శ్రీనివాసరావు, సభ్యులు ఐ.సాయిబాబు, ఎం.నాగేంద్రరావు, ఎన్.రమణబాబు, ఎంఎన్.మూర్తి, డిఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఎప్పుడు?

ప్రజాశక్తి - గుంటూరు

ఎటువంటి హామీ ఇవ్వకపోయినా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించిందని, హామీ ఇచ్చిన ఏపీ ప్రభుత్వం ఎప్పుడు చేస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా ప్రశ్నించారు. అసోసియేషన్ జిల్లా సమావేశం నగరంపాలెంలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. చాంద్‌బాషా మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు తన పాదయాత్రలో కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు దాటినా ఇంత వరకూ రెగ్యులర్ చేయకపోవటంలో శోచనీయమని అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎప్పుడు రెగ్యులర్ అవుతామా.. అని ఎదురు చూస్తున్నారన్నారు. తక్షణమే కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలని, 1993 నవంబర్ 25కు ముందు సర్వీసులో చేరిన చేరిన ఎన్ఎంఆర్‌లను కూడా రెగ్యులర్ చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరిముల్లా షాఖాదరి, జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, మురళి, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు పెదరత్తయ్య, జాయింట్ సెక్రటరీ భరత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సయ్యద్ చాంద్‌బాషా

అవయవదానంతో ముగ్గురికి జీవితం

ప్రజాశక్తి-తాడేపల్లి



యువకుని అవయవదానం ద్వారా ముగ్గురి జీవితాల్లో వెలుగులు ప్రసరించాడు. విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు వల్లపు శ్రీరాములు (23) ఇటీవల ప్రమాదానికి గురై తలకు బలమైన గాయమైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు అంబులెన్స్ ద్వారా మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. శ్రీరాములు ఆరోగ్య పరిస్థితిని పరీక్షించిన వైద్యులు అతనికి క్రేనియోథామి శస్త్రచికిత్స నిర్వహించారు. అయినా ఆరోగ్య పరిస్థితిలో మార్పు లేకపోవడంతో మరలా వైద్య పరీక్షలు చేసి బ్రెయిన్ డెత్‌గా నిర్ధారించారు. శ్రీరాములు భార్య వసంత, తల్లిదండ్రుల అంగీకారం మేరకు అవయవదానానికి ముందుకు వచ్చారు. జీవన్‌ధాన్ చైర్మన్ డాక్టర్ కె.రాంబాబు, ఆస్పత్రి డైరెక్టర్ సుధాకర్ కంటిపూడి ఆధ్వర్యంలో అవయవదానం జరిగింది. కాలేయం, ఒక కిడ్నీ మణిపాల్ ఆసుపత్రిలో అవసరమైన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. మరొక కిడ్నీని గుంటూరులో వేదాంత ఆసుపత్రికి తరలించారు. శ్రీరాములు కుటుంబానికి మణిపాల్ ఆసుపత్రి యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.



విద్యార్థుల్లో సృజనను పెంచడానికి వేసవి శిబిరాలు

ప్రజాశక్తి - చేబ్రోలు : వేసవి వినోదం పేరుతో బాల బాలికలకు సిఐటియు, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రాఫ్ట్, మ్యాజిక్, పాటలు కోలాటం తదితర అంశాల్లో పిల్లలకు నిర్వహిస్తున్న శిక్షణను మండల కేంద్రమైన చేబ్రోలులోని షాదీఖానాలో బుధవారం ప్రారంభించారు. కాగితాలతో బొమ్మల తయారీ, సంగీతంపై అవగాహన కల్పించారు. శిక్షణానంతరం ఈరోజు నేర్చుకున్న బొమ్మలతో పిల్లలకు మ్యాజిక్ ట్రిక్స్ నేర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు వి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ మూఢనమ్మకాలను వదిలివేసి, శాస్త్రీయ అవగాహనతో ముందడుగు వేయాలని సూచించారు. చిన్నపిల్లలు గ్రహణ శక్తి, పరిశీలనా శక్తి ఎక్కువగా ఉంటుందని, దానిని అభివృద్ధి చేస్తే ఆణిముత్యాలుగా తయారవుతారని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, యుటిఎఫ్ మండల కార్యదర్శి నాగేశ్వరరావు, జెవివి నాయకులు వేణుగోపాలరావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - నరసరావుపేట : విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు విజ్ఞానం పంచేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పల్నాడు విజ్ఞాన కేంద్రం భాద్యులు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహమ్మద్ అన్నారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గుంటూరు రోడ్డు నిమ్మతోట సిల్మన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న బాలల ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు రెండవ రోజు కార్యక్రమంలో విద్యార్థులకు చేతి రాతపై పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి నోటు పుస్తకాలు, పెన్నులను ఉపాధ్యాయులు షేక్ జున్ను సాహెబ్ అందించారు. విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ గురువారం స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో లిమ్రా హ్యాండ్ రైటింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ షేక్ కరీముల్లా, విజ్ఞాన కేంద్రం భాద్యులు కె.రామారావు, నాగేశ్వరరావు, ఎస్ఎమ్‌డి హుస్సేన్, ఉపాధ్యాయులు శిరీష, డి.సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.



పసుపు పంట బస్తాలతో యార్డు ఎదుట బారులుదీరిన ట్రాక్టర్లు

యార్డుకు పసుపు కళ.. అయినా పెరగని ధర..

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రమైన దుగ్గిరాలలోని వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో బుధవారం 2028 క్వింటాళ్ల పసుపు విక్రయాలు జరిగాయి. వారం రోజుల క్రితం నిల్వ చేసే వ్యాపారస్తులు మాత్రమే కొనుగోలు చేయగా ప్రస్తుతం ఎగుమతుల ఆర్డర్లు రావడంతో ఒక్కసారి కొనుగోళు పెరిగాయి. స్థానిక వ్యాపారులు సైతం భారీ కొనుగోళ్లకు తెరలేపారు. మరోవైపు యార్డు పసుపు బస్తాలతో కిటకిటలాడుతున్నా ధరలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా స్థిరంగా ఉన్నాయి. బుధవారం ధరలు పసుపు కొమ్ములు కనిష్ట ధర రూ.4700, గరిష్ట ధర రూ.5600, సగటు ధర రూ.5360 కాగా దుంపలు కనిష్ట ధర రూ.4800, గరిష్ట ధర రూ.5455, సగటు ధర రూ.5360 పలికాయి.

పసుపు పంట బస్తాలతో కిటకిటలాడుతున్న యార్డు



తెలంగాణ ఎస్ఎస్‌సి ఫలితాల్లో భాష్యం విజయభేరి

ప్రజాశక్తి-గుంటూరు

తెలంగాణ ఎస్ఎస్‌సి ఫలితాల్లో భాష్యం విద్యార్థులు సత్తాచాటారు. 185 మంది విద్యార్థులు 10/10 సాధించి చరిత్ర సృష్టించారని భాష్యం చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. జిపిఎ 9.8 ఆపైగా 392 మంది, 9.7 ఆపైగా 583 మంది, 9.5 జిపిఎపైగా 775, 9 జిపిఎకిపైగా 1327 మంది విద్యార్థులతోపాటు మొత్తం 10,428 మంది 'ఎ' గ్రేడులు కైవసం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా భాష్యం హైదరాబాద్ జోనల్ హెడ్ బి.అంకమ్మరావు మాట్లాడుతూ విద్యార్థుల శ్రమ, ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే ఇంతటి అద్భుత విజయం సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను భాష్యం చైర్మన్ భాష్యం రామకృష్ణ అభినందించారు.

విద్యార్థులతో అంకమ్మరావు, తదితరులు





ఫుడ్ కోర్టులో పల్నాడు కలెక్టర్ భోజనం

ప్రజాశక్తి - నరసరావుపేట

కలెక్టరేట్‌లో ఉద్యోగులు, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బుధవారం భోజనం చేశారు. అనంతరం ఫుడ్‌కోర్టు పరిసరాలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. నాణ్యమైన ఆహారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది ఈ ఫుడ్‌కోర్టును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, వివిధ శాఖ అధికారులు ఉన్నారు.



పురోగతి లేనప్పుడు నేను రావడం ఎందుకు : డిపిఒ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మీకు కేటాయించిన లే అవుట్ పై బాధ్యత లేకుండా పురోగతి లేనప్పుడు వారంవారం నేనెందుకు రావాడం.. అని అధికారులు, సిబ్బందిపై జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ) కేశవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణంపై సమీక్ష సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీరమ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. పంచాయతీల వారీగా సమీక్షించిన డిపిఒ మాట్లాడుతూ కేటాయించిన పంచాయతీల్లో లబ్ధిదార్లతో ప్రత్యక్షంగా మాట్లాడి నిర్మాణానికి ఒప్పిస్తేనే లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. పంచాయతీ స్థాయిలో సమావేశానికి వాలంటీర్లు రావడం లేదనే కార్యదర్శులు చెప్పగా చర్యలు తీసుకోవాని డిపిఒ అన్నారు. దీనిపై జీవో కూడా ఉందన్నారు. కోయవారిపాలెంలో 10 మంది లబ్ధిదార్లకు డబ్బులు ఇప్పించడంలో జాప్యంపైనా డిపిఒ అసహనం వెలిబుచ్చారు. వారంలోగా వారికి డబ్బులిప్పించాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ ఎఇ సురేష్, పంచాయతీరాజ్ ఎఇ కిషోర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీపడదగిన అన్ని క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులు, సివిల్, బ్యాంకు, రెవెన్యూ, బీమా, భూసేకరణ సంబంధిత కేసులు, వివాహ సంబంధిత కేసులు, మోటారు ప్రమాదాల కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, ప్రీ లిటిగేషన్ వ్యాజ్యాలు తదితర కేసులు పరిష్కరిస్తామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.